కథ

# ఆఖరి అవసరం

యస్. శ్రీదేవి

''అమ్మా! నాకు నాన్న లేరా?''

ఆటలకని వెళ్ళిన పూజిత గోడకొట్టిన బంతిలా తిరిగొచ్చి సోఫాలో ముడుచుకుని పడుకుంది. పిల్లల ఆటల్లో ఏదో జరిగిందని అర్థమైంది మధురకి. పూజని వళ్ళోకి తీసుకుని బుజ్జగిస్తూ అడిగింది. ''పూజా! ఏమైందమ్మా? ఏం జరిగిందసలు?''

''నాకు నాన్న లేరా?''


ఆ పిల్ల యిప్పటిదాకా ఎప్పుడూ తండ్రి గురించి అడగలేదు. తండ్రి దగ్గర లేకపోవటమనేది ఒక లోటనిపించకుండా వుండేలా పెంచింది తను. అమ్మ చెప్పిందే వేదమని నమ్మిన పిల్ల దాన్నధిగమించి ఆలోచిస్తోందంటే పసితనపు అమాయకత్వాన్ని వీడి బయటి ప్రపంచంలోకి పరుగుపెడ్తోందన్నమాట. కళ్ళలో నీళ్ళు నిలిచాయి.

తల్లి కన్నీళ్ళు చూసి పూజిత భయపడింది. ''సారీ అమ్మా! ఇంకెప్పుడూ అడగను. ప్రామిస్'' తల్లి మెడని కౌగలించుకుని ఆమె గుండెల్లో తలదాచుకుంది.

దెబ్బలాడుకుని విడిపోయిన యిద్దరు స్త్రీపురుషులమధ్య అలా విడిపోలేని శరీరపు ఏకత్వంతోటి వ్యక్తిత్వపు భిన్నత్వంతోటీ సతమతమయ్యే పిల్లలుంటారు. పెద్దవాళ్ళ అహంభావాల వొరిపిడికి నలిగిపోతుంటారు. ఇవన్నీ తెలిసీ ఏమీ చెయ్యలేని నిస్సహాయత మధురది.

పూజిత అంత హఠాత్తుగా తండ్రి గురించి అడగటమే పెద్దషాక్. మధురకి అలాంటిది ఆ పిలుపు అందుకున్నట్టు ఆనంద్ రావటం యింకా పెద్ద షాక్.

చిట్‌ఫండ్ కంపెనీ నుంచీ అప్పుడే వచ్చింది మధుర. మొదటివారం కావటంతో కలెక్షన్లు బాగా వున్నాయి. ఎకౌంటు టేలీ కావడం కాస్త కష్టమైంది. ఇంటికొచ్చి టీవీముందు కూర్చున్నాక కూడా ఆ లెక్కలు కళ్ళముందునించీ చెదరలేదు. పూజిత తల్లిని విసిగించకుండా పాలు తాగేసి ఆడుకోవడానికి వెళ్ళింది.



అప్పుడొచ్చాడు ఆనంద్. వాకిట్లో చప్పుడైతే ఎవరోనని తలతిప్పి చూసి స్థాణువైంది మధుర. ఆ తర్వాత ఒక్కక్షణం కూడా అతన్ని ఎదుర్కోలేనట్టు లేచి వంటింట్లోకి వెళ్ళి కూర్చుంది. ఆమె నుంచీ ఎలాంటి ఆహ్వానం లేకపోయినా లోపలి కొచ్చి కూర్చున్నాడతను.

ఇన్నేళ్ళ తర్వాత ఎందుకొచ్చినట్టు? మధుర ఆలోచనలు పరిపరి విధాల పోతున్నాయి. ఆనంద్ పరిస్థితి అందుకు భిన్నంగా ఏం లేదు. ఏం మాట్లాడాలి? ఎలా అడగాలి? తనెందుకొచ్చాడో ఎలా చెప్పాలి?

ఇద్దరూ అలాగే కూర్చున్నారు చాలాసేపు. టీవీ దానిమానాన అది మోగుతోంది. ఆటలకెళ్ళిన పూజిత బంతికోసం మళ్ళీ వచ్చింది. వాకిట్లో వున్న చెప్పుల్ని చూసింది. ఎవరొచ్చారా అనుకుంటూ కుతూహలంగా తొంగిచూసి, ఒక్కడే కూర్చుని వున్న ఆనంద్ కనిపించగానే బెరుగ్గా అడుగులో అడుగేసుకుంటూ తల్లి దగ్గరకి జారుకుంది. తల్లి ముఖంలో ఎప్పుడూ చూడని భావాలు.

''ఎవరు?'' గుసగుసగా అడిగింది.

''డేడీ!'' లోగొంతుతో చెప్పింది మధుర.

పూజిత తండ్రిని చూడటం అదే మొదటిసారి. తల్లిని అపనమ్మకంగా చూసి హాల్లోకి వెళ్ళింది. ఆనంద్ కూడా పూజితని ఆశ్చర్యంగా చూసాడు. తామిద్దరూ విడిపోయినప్పటికి పూజిత ఆర్నెలలపిల్ల. ఎంత పెద్దదైంది. విస్మయంగా అనుకున్నాడు. దగ్గరకు రమ్మని పిలిచాడు. ఆ పిల్ల వెళ్ళలేదు. చురచుర చూసింది.

''మీరు మా డేడీయా?'' సూటిగా అడిగింది.

కూర్చున్న చోటే అస్థిమితంగా కదిలాడు ఆనంద్. ఇన్నేళ్ళ తర్వాత సంబంధాలని పునరుద్ధరించుకోవాలని వచ్చినందుకు భార్యకి జవాబు చెప్పుకోవాలనుకున్నాడు. అలాగే ప్రిపేరై వచ్చాడు. కానీ ఆమె ఒక్కమాటేనా మాట్లాడలేదు. బదులుగా ఈ పిల్ల నిలదీస్తోంది. నవ్వొచ్చింది. నవ్వుతూనే తలూపాడు పూజిత ప్రశ్నకి జవాబిస్తున్నట్టు.

''నన్ను మీరెప్పుడేనా చూసారా?''

''.....''

''మా స్కూల్ డే ఫంక్షన్‌కి వచ్చి పేరెంట్సు గేలరీలో కూర్చున్నారా?''

''...''

''నాకు నాన్న లేడని ఎప్పుడూ ఏడిపిస్తుందే కేథరీన్, దానికి బుద్ధి చెప్పారా?''

ఆనంద్ నిస్సహాయంగా తలదించుకున్నాడు. అతని మొహంలోని చిరునవ్వు హరించుకుపోయింది. పూజిత అడిగినవేవీ తను చెయ్యలేదు.

''పూజా! అయాం సారీ! ఇంకముందెప్పుడూ నిన్నొదిలిపెట్టి వుండను. నీతోటే వుంటాను. మనింటికి వెళ్ళిపోదాం. అమ్మకి చెప్పు'' నెమ్మదిగా అన్నాడు.

లోపల మధుర వుక్కిరిబిక్కిరైంది. ఆనంద్. సారీ చెప్పటమా? తను చెయ్యని తప్పులకి కూడా అతని తల్లికి క్షమార్పణ చెప్పించేవాడు. అలాంటి వ్యక్తి తప్పొప్పుకుని పశ్చాత్తాపాన్ని వ్యక్తపరచటమా?

''నేను రాను. ఇదే మా యిల్లు. మమ్మీ కూడా రాదు'' కచ్చితంగా అనేసింది పూజిత.

ఆమె అంతరంగం లోపల అతని పట్ల ప్రకృతిపరమైన ప్రకంపనాలూ, ఆకర్షణా వున్నాయోమోగానీ, వాటిని గుర్తించే వయసింకా రాలేదు. అందుకని అతని యింటికి వెళ్ళటమంటే అయిష్టంగా అనిపించింది. సమస్యని నిమిషంలో పరిష్కారం చేసేసి, మరోమాటకి అవకాశం యివ్వకుండా బంతి వెతుక్కుని మళ్ళీ వెళ్ళిపోయింది పూజిత.

ఆనంద్ ముఖం పాలిపోయింది. అప్పుడొచ్చింది మధుర అతని సమక్షంలోకి. పూజిత మాటలు, పాలిపోయిన ఆనంద్ ముఖం ఆమె అహాన్ని చాలా సంతృప్తిపరిచాయి. కానీ అంతలోనే ఆమె విచక్షణ మేలుకొంది. జీవితం అంటే అహాన్ని సంతృప్తిపరుచుకోవటం ఒకటే కాదు కద!

''పూజ చాలా సరిగ్గా చెప్పింది మధూ! అది అడుగులేస్తున్నప్పుడు నా గుండెలని పరవలేదు. స్కూలుకెళ్తున్నప్పుడు చిటికెన వేలు అందివ్వలేదు. నేను నీకు చేసిన అన్యాయం దానిమీద ప్రతిబింబించింది. కానీ ఒక్క విషయం నేను చాలా మారిపోయాను. భార్యాపిల్లలకన్నా తల్లిదండ్రులు ఎక్కువ అనే భ్రమలోంచీ బైటపడ్డాను. ఎవరి స్థానాలు వారివేనని



## అందాలవిందు

**బాలీవుడ్ బేబి హృషితాభట్ కొత్త చిత్రం గురించే అంతా చర్చించుకుంటున్నారు. అశోక, జైట్ ఆఫ్ కంట్రోల్ వంటి చిత్రాల్లో నటించన ఈభామ ఇప్పుడు తెలుగు చిత్రంలో నటిస్తోంది. హీరో నితిన్ తండ్రి సుధాకర్‌రెడ్డి నిర్మాతగా శంకర్ దర్శకత్వంలో ఈ చిత్రం నిర్మితమవుతోంది. ఈ చిత్రంలో హృషితాతో పాటు జెనీలియా నటిస్తోంది. తమిళ మ్యూజిక్ డైరెక్టర్ శంకర్ రాజా ఈ చిత్రానికి సంగీతాన్ని సమకూరుస్తున్నారు. ఈచిత్రం షూటింగ్ యాభైశాతం పూర్తికాగా మిగిలిన భాగాల్ని పూర్తిచేసి సంక్రాంతికి విడుదల చేస్తారు.**

గ్రహించాను. నువ్వు వెళ్ళిపోయాక నాలో ఏర్పడిన శూన్యం అంతకంతకీ విస్తరించి నన్ను నిలువునా ఆవరించింది. దయచేసి నన్ను అర్థం చేసుకో. మళ్ళీ మనం కలిసుండటాన్ని యిగోఫ్యాక్టర్‌గా మార్చకు. పూజ చాలా ఎగ్రెసివ్‌గా వుంది. దానికి నచ్చచెప్పు'' అభ్యర్థించాడతను.

మధుర మాట్లాడలేదు. అతను చెప్తున్నది నిజమే కావచ్చు. మనిషిలో చాలా మార్పొచ్చినట్లే వుంది. అతనిమీద కొద్ది ప్రేమ కలిగింది. అది జాలితో కూడుకున్నది. మరి తను? ఎన్నో ఆశలతో పెళ్ళిచేసుకుని, అవన్నీ కరిగిపోతుంటే నిలుపుకోవాలని ఆరాటపడి ఆఖరికి ఏమీ చెయ్యలేని నిస్సహాయతతో విరాగిలా బతుకుతున్న తను...ఈ విధమైన జీవితానికి అలవాటుపడ్డాక మళ్ళీ కుటుంబ జీవితంలోకి అడుగుపెట్టగలదా? ఎక్కడో అయిష్టత..యింకెక్కడో భయం...అన్నీ లోపల దాచుకుంది.

''టీ త్రాగి వెళ్దురుగాని కూర్చోండి'' అంది అతను లేవటం చూసి క్లుప్తంగా. దానికే ఎంతో సంతోషపడిపోయాడు ఆనంద్. బిగుసుకున్న ముడి కొద్దిగా వదులైనట్టనిపించింది. మధుర టీకప్పుల్తో తిరిగొచ్చేసరికి అతను సోఫాలో కన్వీనియెంటుగా సెటిలయ్యాడు. అతని ఎదురుగా కుర్చీలో కూర్చుంది మధుర. ఆమె దూరాన్ని చూపెట్టడాన్నీ తన పట్ల ఎలాంటి ఆత్మీయతనీ ప్రకటించకపోవడాన్నీ అతను గమనించకపోలేదు.

ఒక మొక్కని పీకి పారెయ్యటం క్షణాల్లో చెయ్యగలిగే పని. అదే మొక్కని నాటి పెంచడం అంత తేలిక కాదు. తామిద్దరిమధ్యా అనుబంధం కూడా అంతే. తుంచేసినదాన్ని తిరిగి బ్రతికించాలి. అది ఒక్కసారిగా జరగదు. టైం పడుతుంది. సుదీర్ఘంగా నిశ్వసించాడు.

ఇద్దరి మధ్యనీ ఎన్నో కబుర్లు దొర్లాయి. అతని తల్లిదండ్రుల గురించీ చెల్లెలూ, తమ్ముడి గురించీ అడిగి తెలుసుకుంది. ''ఇన్నేళ్ళలో మీకుగానీ, మీ యింట్లో వాళ్ళకిగానీ నేనూ పాపా ఒక్కసారేనా గుర్తురాలేదా? శుభకార్యాల్లో మీరు వంటరిగా తిరుగుతున్నప్పుడేనా?'' అడిగింది.

అతను తలదించుకున్నాడు. మధుర గుర్తొచ్చేది. కానీ ఆర్తితో కాదు కాపురాన్ని వదులుకుని వెళ్ళిపోయిన అమ్మాయిగా.

''అమ్మానాన్నలతో కలిసి బాధ్యతలు పంచుకున్నప్పుడు వాళ్ళంతా నావాళ్ళేననిపించేది. ఎక్కడివాళ్ళక్కడికి వెళ్ళిపోయాక తిరిగి చూసుకుంటే నాకంటూ ఎవరూ లేరనిపించింది. చాలా చిత్రంగా అమ్మానాన్నా కూడా పరాయిగానే అనిపించారు. అప్పుడర్థమైంది మధూ వ్యక్తిగత జీవితానికీ, కుటుంబ జీవితానికీ గల తేడా..మరో పెళ్ళి చేసుకోమంది అమ్మ.''

మధుర ముఖం ఎర్రబడింది. ''చేసుకోవలసింది'' అంది పదునుగా.

''మా అమ్మ అలా అనటంతోనే ఎక్కడ పొరపాటు జరిగిందో అర్థమైంది. నాకు వండిపెట్టి, నా అవసరాలు తను చూడగలిగినంత కాలం..నేను కొన్ని బాధ్యతల్ని అందుకోవాల్సి వున్నంతకాలం నువ్వు నన్నెక్కడ వాళ్ళనుంచీ వేరు చేస్తావోనని భయపడింది. నీపట్ల వైరాన్ని పెంచుకుంది. అక్కడ నువ్వనే యింకెవరు నీ స్థానంలో వున్నా అంతే. ఆవిడ వయసైపోయింది. విశ్రాంతి తీసుకోవాలనుకుంటోంది. కానీ నా అవసరాలు చూడాల్సిన బాధ్యత యింకా మిగిలుంది. ఇప్పుడు నాకో భార్య వుంటే బావుంటుందనిపించింది. అది నువ్వే కానక్కర్లేదు ఎవరో ఒకరు. నాకు మాత్రం నువ్వే కావాలి. జరిగింది మర్చిపో. నేను చాలా సిగ్గుపడుతున్నాను నిన్ను సరిగ్గా చూసుకోలేకపోయినందుకు''


''మీ అమ్మగార్ని ద్వేషించమనిగానీ వేరుకాపురం పెడదామనిగానీ నేనెప్పుడూ మిమ్మల్నడగలేదు. నా తల్లిదండ్రుల్నీ, అన్నదమ్ముల్నీ పుట్టి పెరిగిన పరిసరాలనీ నావనుకున్న అన్నిటినీ వదులుకుని వచ్చిన నాకు పిసరంతేనా ఆదరణ దొరకలేదు. నా అవసరాలకీ, ఖర్చులకీ సరిపడా కట్నం తెచ్చుకున్నాను. ఐనా కూడా నన్ను అన్‌వాంటెడ్ గెస్ట్‌గా చూసేవారు మీ యింట్లో. నా ఆత్మగౌరవాన్ని ఎవరూ ఎప్పుడూ గుర్తించలేదు. ఆఖరికి మీరు కూడా. నేనెంతగా చెప్పాలని ప్రయత్నించినా మీరు వినిపించుకునేవారు కాదు. అసలు ఏ యిద్దరు వ్యక్తుల మధ్యనేనా సర్వెంట్ మాస్టర్ రిలేషన్‌షిప్ ఎందుకుండాలి?''

ఆనంద్ తలొంచుకున్నాడు. తల్లి మాటలు విని తను మధురని ఎంతగా హర్ట్ చేసిందీ గుర్తొచ్చింది. పూజ ఎగ్రెసివ్‌నెస్ గుర్తొచ్చింది. గుండెల్లో ఎక్కడో వాడిగా గుచ్చుకున్నట్లైంది. లేచి నిలబడ్డాడు.

మధుర నిర్వేదంగా నవ్వుకుంది. ప్రాణం పోయేముందు అది శరీరాన్ని వదల్లేక కొట్టుకుంటుంది. శరీరాన్ని వదిలేసాక కూడా కొంతకాలం మమకారాన్ని వదలలేదని చెప్తారు వేదాంతులు. అతనింట్లోంచీ వచ్చే ముందూ, వచ్చేసిన తర్వాత కొంత కాలమూ తనకలాగే వుండేది. ఆ తర్వాత పునర్జన్మ ఎత్తినట్లైంది. మళ్ళీ

## శుభారంభం!

అగ్రహీరోల చిత్రాల గురించిన విశేషాలు అందరికీ ఆసక్తిని కలిగిస్తాయి. విక్టరీ వెంకటేష్ కొత్త చిత్రం షూటింగ్ సంక్రాంతికి ప్రారంభం కానుంది. 7/జి బృందావన్‌కాలనీ చిత్రానికి దర్శకత్వం వహించిన శ్రీరాఘవ ఈ చిత్రానికి దర్శకత్వం వహించనున్నారు. ఈ చిత్రంలో నటించే హీరోయిన్ ఎవరా అని అంతా ఆసక్తి కనబరుస్తున్నారు. మంచి హిట్ కోసం ఎదురు చూస్తున్న వెంకటేష్ కొత్త ఏడాదిలోనైనా శుభారంభం చేస్తాడేమో చూద్దాం.



అతని గురించి, వైవాహిక జీవితాన్ని కొనసాగించడాన్ని గురించీ ఆలోచించడమంటే వదిలిపెట్టేసిన శరీరంలోకి తిరిగి ప్రాణాన్ని పంపటమే!

''పూజకి నచ్చజెప్పి చూస్తాను'' అంది అతను గుమ్మం దాటుతుంటే. అతను వెళ్ళిపోయాడు.

రాత్రి పూజని అడిగింది మధుర, ''డాడీ మనని రమ్మంటున్నారు వెళ్దామా?'' అని.

''ఎందుకు?'' అడిగింది పూజ.

''పోనీ డాడీనే యిక్కడికి రమ్మందామా?''

''అదే ఎందుకని?''

కూతురి ఎదురు ప్రశ్నల్తో నిరుత్తరురాలైంది. వదిలెయ్యడానికీ, వదిలెయ్యబడటానికీ గల తేడాని సమాజం యిప్పుడిప్పుడే గుర్తిస్తోంది. సంపాదించి పెట్టి, రక్షణ నివ్వగలిగే తల్లి వున్నప్పుడు తండ్రి అవసరమేమిటో పూజలాంటి పిల్లలకి తెలిసే అవకాశం లేదు. దానికి జవాబు ఆనందే చెప్పాలి. తన దగ్గర లేదు.

పూజ నిద్రపోయాక అతనికి ఫోన్ చేసి అదే విషయం చెప్పింది.

రాత్రంతా మధురకి కలతనిద్రే అయింది. కళ్ళ ముందు ఎన్నో జ్ఞాపకాలు...సమాధుల్లోంచీ నిద్రలేచిన ప్రేతాల్లా. పెళ్ళి తనలో మధురస్మృతుల్లో ఒక్కటేనా మిగల్చకపోవటం, ఆనంద్ పునరాగమనం ఎలాంటి అనుభూతుల్నీ రేపకపోవటం స్త్రీగా ఈ దేశంలో పుట్టి ఆమె చేసుకున్న పాపం. కళ్ళలో నీళ్ళు నిలిచాయి.

★ ★ ★

నాలుగుసార్లు పెళ్ళిచూపుల్లో కూర్చుని ఐదోసారి నెగ్గింది మధుర ఆ పరీక్షలో. తండ్రి ఘనంగా పెళ్ళి చేసాడు.

పెళ్ళి!

'ఏముందిందులో? స్త్రీపురుషుల సంబంధమేగా అనుకోవటం వుంది. ఏమీ లేకపోతే పెళ్ళికోసం ఎందుకింత ఆరాటం అని ప్రశ్నించుకోవటం కూడా వుంది. పెళ్ళి పేరిట దోచుకోవటం వుంది, దివాలా తియ్యటమూ వుంది. కాల్చుకు తినటం జరిగింది. కాల్చి చంపటం కూడా జరిగింది. ఇంత రసబీభత్సంగా వుండే పెళ్ళిలో మధురకి ఎలాంటి రసానుభూతీ దొరకలేదు.

కారణాలు వెతకడానికేమీ వుండవు. ఒకటిగా కలిసిపోయి వుండాల్సిన భార్యాభర్తలమధ్య ఇంకొందరి జోక్యం వుండేసరికి ఒక వేర్పాటు గీత గీయబడుతుంది. భార్యా భర్త సరిపడకపోతే సర్దుకుంటూనేనా ఏదో ఒకలా చివరిదాకా కలిసి వుంటారు. అత్తాకోడళ్ళకి సరిపడకపోతే మాత్రం ఆ కాపురం డొటే.

మధురని అత్తవారింట్లో చాలా చులకనగా చూసేవారు. ఇంటిపనంతా చేసేది. ఆమె చేసిన ఏ ఒక్కపనీ ఎవరికీ నచ్చేది కాదు. ప్రతి చిన్నదానికీ అత్తగారు ఆక్షేపించేది.

ఎంతోమంది చదువుకున్న అమ్మాయిల్లాగే ఆమెలోనూ సంఘర్షణ మొదలైంది. పుట్టింట్లో అపురూపంగా పెరిగింది తను. చదువు, స్నేహితులు, యింటిపనిలో తల్లితో భాగం పంచుకోవడం. పెళ్ళి గురించీ భర్త గురించీ అందమైన ఆలోచనలుండేవి. అందుకు భిన్నమైన వాతావరణం అత్తగారింట్లో ఎదురైంది.

అత్తింట్లోకి ప్రేమపూరితమైన ఆహ్వానం లేదు. తన రాకనీ వునికినీ అయిష్టంగా, తప్పనిసరిగా వప్పుకున్నట్టు వుండేది. అందరికీ వంట చెయ్యడం, రెండు పూటలా స్నానం చేసి అందరూ విడిచిన బట్టల్ని వుతకడం, యింకా మిగిలిన పనులూ...ఆపైన అత్తగారి కస్సుబుస్సులు పడటం...ఇవేనా కోడలిగా, ఆనంద్ భార్యగా తన బాధ్యతలు?

రెండున్నర లక్షల కట్నం యిచ్చాడు తండ్రి తనకి. అందులో యాభై వేల విలువచేసే బంగారం పెట్టారు. ఇరవై వేలు పట్టుచీరలకి యిచ్చారు. మిగిలిన డబ్బంతా అత్తవారే తీసుకున్నారు. వాడుకున్నారేమో! తనది అంత డబ్బు వాళ్ళ దగ్గర వున్నాక కూడా తను వాళ్ళకి బరువనిపించటమేమిటో అర్థమవక యింకొంత అసంతృప్తి.

## 'అసాధ్యుడే'నా?

**'అతనొక్కడే' అంటూ ఎన్టీఆర్ మరో వారసుడు కళ్యాణ్‌రామ్ సృష్టించిన సంచలనం అందరికీ పరిచితమే. ఇపుడు 'అసాధ్యుడు'గా జనం ముందుకి వస్తున్న కళ్యాణ్‌రామ్‌లో అదే ఊపు కన్పిస్తోంది. వల్లూరిపల్లి రమేష్ ఈ చిత్రానికి నిర్మాణ సారథ్యం వహిస్తున్నారు. అతనొక్కడేలాగే ఈ అసాధ్యుడు కూడా తన చిత్రం పేరుని సార్థకం చేసుకుంటాడేమో చూడాలి మరి!**



ఈ రెండిటికన్నా ముఖ్యమైనది ఆనంద్‌కీ ఆమెకీ మధ్య పెద్దగా అనుబంధం ఏర్పడకపోవటం- ఆ దిశగా అతనెలాంటి ప్రయత్నం చెయ్యకపోవటం.

అతన్తో ఏవో చెప్పబోయేది. అతను వినిపించుకోకుండా, ''మా యింట్లో పెద్దవాళ్ళని గౌరవించడం, వాళ్ళేలా చెప్తే అలా వినడం అలవాటు. ఈ రెండూ నువ్వూ నేర్చుకుంటే మంచిది'' అనేసాడు.

''మీ అమ్మ మిమ్మల్నందర్నీ చూస్తున్నట్టే నన్నూ చూస్తోందా?'' గాయపడి అడిగింది మధుర. ఆమె అలా అడుగుతుందని అతను వూహించలేదు. అతనివరకూ అతనికి పెళ్ళి ఒక బాధ్యత. తను పెళ్ళిచేసుకోవడం ద్వారా తండ్రికి ఆర్థికంగా కొంత వెసులుబాటు కలిగింది. అలాగే యింటి పనుల్లో తల్లికి ఆసరా దొరికింది. తన భౌతికావసరాలు కూడా తీరుతున్నాయి. అంతకుమించి మధురపట్ల అతనికే ఫీలింగ్సూ లేవు. ఆమె మాటలకి కోపం వచ్చింది. ఆమెతో మాట్లాడటం మానేసాడు. తల్లికి ఆమె చేత సారీ చెప్పించిగానీ మళ్ళీ

మాట్లాడలేదు. అప్పట్నుంచీ మధురకి భర్తపట్ల చిన్నగా అసహ్యం మొదలైంది.

ఈ పరిస్థితుల్లో మధుర ప్రెగ్నెంటైంది. ఐదుగుర్ని కని, తన తొలికాన్పు మధురానుభూతుల్ని కాలవాహినిలో రాల్చేసిన ఆనంద్ తల్లికి అదేమంత గొప్ప విషయంలా అనిపించలేదు. మధురకి అదే పని, అదే దిగులు..పైనుండీ తిండి సహించకపోవటం. విరక్తిలాంటిది ఏర్పడిపోయింది.

ఐదో నెలలోనూ, ఏడో నెలలోనూ ఆమెని తమ దగ్గరికి తీసుకెళ్ళాలని మధుర తల్లిదండ్రులు చేసిన ప్రయత్నాలు సాగలేదు. తొమ్మిదవ నెలలో గానీ ఆనంద్ వాళ్ళూ పంపలేదు. అప్పటికి పెళ్ళి పేరిట ఒక అనవసరమైన బాధ్యతని తలకెత్తుకున్నా నన్న భావన మధురలో బాగా బలపడిపోయింది.

తల్లితో యివన్నీ చెప్పి బాధపడింది.

ఆవిడ నిట్టూర్చి ''కొత్తకోడలికి యివ్వన్నీ తప్పవు మధూ! మేమంతా అనుభవించినవాళ్ళమే కదా! పెళ్ళైన కొత్తలో కూర మాడిపోయిందని మీ మామ్మ గరిట కాల్చి వాతపెట్టింది'' అంది గుర్తుచేసుకుంటూ.

మధురకి దిగ్భ్రాంతి కలిగింది. ''మరి నాన్నేమీ అనలేదా?'' అడిగింది.

''ఇలాంటి విషయాలు మగవాళ్ళదాకా వెళ్ళేవి కాదు''

''ఎందుకని ఆవిడలో అంత అసహనం?''

''కారణాలు రెండు. మొదటిది వ్యక్తిత్వం అణచివేయబడటం, రెండోది అభద్రతా భావం. స్త్రీ అంటే వంటింటికే అంకితమై వుండాలన్న భావం బాగా వుండేది ఆరోజుల్లో. మీ తాతకి మరీను. ఆవిడేదైనా చెప్పబోతే నీకేం తెలీదు నోరుమూసుకుని పడుండు అని బాహాటంగా తిట్టేవారు. ఇకపోతే..కోడలొచ్చి కొడుకుని కొంగుకి కట్టేసుకుని యింటిపెత్తనం చేతిలోకి తీసుకుని తనని ఆ వంటింటికి కూడా కాకుండా చేస్తుందనే భయం. ఈ విషయంలో తరాలు మారినా ధోరణులు మారలేదు''

''అలాంటప్పుడు ఎవరిదారిని వాళ్ళు వేరే వుండచ్చు కదమ్మా!''

కూతురి అంతర్గత భావం అర్థమైందావిడకి. ''వేరు కాపురానికి అతనొప్పుకుంటాడా?'' అడిగింది.

మధుర జవాబివ్వలేదు.

''తొందరపడకమ్మా! తప్పు నీలో కూడా వుందేమో! ఆలోచించు. అతన్తోపాటు అతని వాళ్ళనీ నీవాళ్ళనుకోవాలి మరి!'' అందావిడ నచ్చజెప్పున్నట్టు. అంతకన్నా ఏం చెప్పగలదు? ఏదైనా ఆనంద్‌ని బట్టి వుంటుంది.

★ ★ ★

మధురకి పాప పుట్టింది. ఆడపిల్ల పుట్టిందని అలిగి ఆనంద్‌వైపునుంచీ చూడటానికి ఎవరూ రాలేదు. ఆఖరికి ఆనంద్ కూడా. పాప పేరు మీద పాతికవేలు- అదీ ఆనంద్ మైనర్ గార్డియన్‌గా వేస్తే వస్తామని చెప్పారు, బారసాలకి పిలవడానికి వెళ్ళిన మధుర తల్లిదండ్రులతో.

''ఇదెక్కడి గొడవ? ఆడోమగో దేవుడెవర్నిస్తే వాళ్ళు...ఎవరైనా స్వంత పిల్లలు. పుట్టిన పాపాయిని చూడటానికి ఇప్పటిదాకా ఎవరూ రాలేదు. పైగా యిదొకటా? వట్టి డబ్బుమనుషుల్లా వున్నారే!'' అంది మధుర తల్లి. మళ్ళీ గట్టిగా అనడానికి భయం. అసలే వాళ్ళంటే అయిష్టంగా వున్న మధుర ఆ అయిష్టాన్ని యింకా పెంచుకుంటుందేమోనని.

వాళ్ళడిగినట్టే డబ్బు పాప పేర వేసి బారసాల ఏర్పాట్లు చేసాడు మధుర తండ్రి. ఎవరికీ సంతోషంగా లేదు. బలవంతంగా తిరుగుతున్నారంతే.

పెళ్ళి చేసుకోవడానికి కట్నం తీసుకుని, కాపురం చెయ్యడానికి కానుకలు తీసుకుని, కడుపు చేసి పురిటిఖర్చులు మామగారిమీదకి నెట్టి, పాతికవేలు తీసుకునిగానీ పాపాయికి పేరు పెట్టడానికి రాని ఆనంద్‌ని బారసాల పీటల మీద తనపక్కని కూర్చున్నప్పుడు తృణీకారంతో చూసింది మధుర.

★ ★ ★

''జాగ్రత్త మధూ! వాళ్ళు మూర్ఖులని నువ్వూ మూర్ఖంగా ప్రవర్తించకు. ఎవరేమనుకున్నా వేళకి భోజనం మానకు. కొంత ఓర్చుకుంటే పరిస్థితులవే దార్లో పడతాయి. స్త్రీపురుషుల మధ్య ప్రేమలూ, యిష్టాలూ అనేవి కథల్లోనూ సినిమాల్లోనూ మాత్రమే కనిపించేవి. నిజజీవితంలోని ఆకాంక్షలూ, కోరికలే వాటిల్లో ప్రతిబింబిస్తాయి. ఆ యింట్లో నిలదొక్కుకునే ప్రయత్నం చెయ్యి. పాప మీమధ్యని వుంటుందిగాబట్టి అతను కూడా మారవచ్చు'' మూడో నెలలో మధురని పంపిస్తూ చెప్పింది తల్లి.

మధుర తన శాయశక్తులా ప్రయత్నించి ఓడిపోయింది. సంస్కారికి సంస్కారంతోటీ కుసంస్కారికి కుసంస్కారంతోటీ జవాబివ్వాలి. అందరాడపిల్లల్లా నోరు చేసుకుని దెబ్బలాడినా, అడుగడుక్కీ తను తెచ్చిన కట్నకానుకల్ని గుర్తుచేస్తూ అత్తవారిని కించపరచడమో, చీప్ ట్రిక్స్‌తో ఆనంద్‌ని వశపరుచుకుని చూపుడు వేలి చుట్టూ తిప్పుకోవడమో చేసి వుంటే ఆమె అత్తింట్లో నిలదొక్కుకుని వుండేది.

అప్పటికి పూజితకి ఆరు నెలలు.

★ ★ ★

పాపాయి అదనపు భారం కాగా అత్తింట్లో చాకిరీకీ, దానికన్నా ఎక్కువగా నిరాదరణకీ నలిగిపోయి అలిసి, పుట్టెడు అనారోగ్యంతో పుట్టినిల్లు చేరింది మధుర.

''ఇదెక్కడి రాక్షసత్వమే? కక్ష కట్టినట్టు చంటిపిల్ల తల్లిచేత అంతపని చేయించడమేమిటి? పనిమనిషిని పెట్టుకునే తాహతు కూడా లేదా వాళ్ళకి? అంత గతి లేక వున్నారా?'' అని విలవిల్లాడింది తల్లి.

''అది నా యిల్లు కాదు అతనిది. అక్కడ నాకు స్థానం లేదు. మీకు నేను గుండెల కుంపటినీ, మొయ్యలేని భారాన్నీ

## సత్తా చూపిస్తా

**సీనియర్ నటులతో కలిసి నటించడం మంచి ఎక్స్‌పీరియన్స్ అంటోంది అందాల భామ జెనీలియా. 'ఎప్పుడూ కొత్త హీరో, హీరోయిన్లు కావాలంటారు. అయితే కొత్తతారలు పాతవారితో కలిసి నటించడం వల్ల ఎంతో మేలు ఉంటుంది. షూటింగ్స్‌లో ఎలా మసలుకోవాలో తెలుసుకునే వీలుంటుంది' అంటోంది ఈ భామ. ఈ భామ ఇప్పుడు మళ్లీ తెలుగులో విజృంభిస్తానంటోంది. అన్నట్టు జెనీలియా నితిన్ సరసన ఓ సినిమాలో మెయిన్ హీరోయిన్‌గా నటిస్తోంది.**



కాబట్టి యింత డబ్బిచ్చి వదుల్చుకున్నారు. పెళ్ళి పేరుతో, వాళ్ళింట్లో అడ్డమైన చాకిరీ చేస్తే దయ తల్చి యింత ముద్ద పడేస్తారు. అంతే అతని తల్లి అభిప్రాయం అది. అతను జడుడు. తప్పొప్పుల విచక్షణ తెలీని జడ పదార్ధం. తల్లి ఎంత చెప్తే అంత'' అంది మధుర విరక్తిగా.

ఇంట్లోని అందరూ నిశ్చేష్టులైపోయారు. అప్పటికా విషయం వదిలేసినా అదొక బర్నింగ్ ప్రాబ్లంగానే వుండిపోయింది.

''మధూ? పెళ్ళయ్యాక ఆడపిల్ల భర్త దగ్గర వుండటం ఉచితం. నువ్వొక్కదానివే అయితే అది వేరే విషయం. ఇప్పుడు పాప కూడా వుంది. పెద్దవాళ్ళం వెళ్ళి మాట్లాడతాం'' అన్నాడు మధుర తండ్రి ఆమెకి స్పష్టత చేకూరాక.

''భయపడి పారిపోతే ఈ ప్రపంచంలో ఏదీ సాధ్యపడదు. బావతో నేనూ మాట్లాడతాను. ఇది పద్ధతి కాదని చెప్తాను'' అన్నాడు మధుర అన్న. అతనికి చెల్లెలి పెళ్ళి మిస్‌వెంచర్‌లా, రాంగ్ ఇన్వెస్టిమెంట్‌లా అనిపిస్తోంది.

మధుర గుండెకి పదునైన గాయమైంది. ఆడపిల్లకి పుట్టిల్లూ అత్తిల్లూ తప్ప స్వంతిల్లంటూ వుండకపోవటమే అన్ని సమస్యలకీ మూలం. పుట్టింట్లో ఆదరణే తప్ప హక్కులుండవు. అత్తింట్లో హక్కులే తప్ప ఆదరణ వుండదు. ఈ రెండూ కాని చోటే ఆ రెండిటి సమన్వయం సాధ్యపడుతుంది. ఆచోటికి ఆనంద్ రాడు.

తండ్రితోగానీ అన్నతోగానీ వాదించలేదామె. వెంటనే ఒక స్నేహితురాలి గదిలోకి షిఫ్టైపోయింది.

తర్వాత ఒక చిట్‌ఫండ్ కంపెనీలో ఎకౌంటెంట్ పోస్టు సంపాదించుకుని విడిగా వుండటం మొదలుపెట్టింది.

మధుర తల్లికి బాధేసింది. ''పైస పైస కూడబెట్టి లక్షలు చేసి వాళ్ళ ముఖాన పోసాం పిల్ల సుఖపడుతుందని. అందులోంచీ అది తిన్నదీ అనుభవించిందీ లేదు. బంగారం, చీరలూ కూడా వాళ్ళ దగ్గరే వున్నాయి. అక్కడ యిమడలేక అది తిరిగొస్తే దాన్నీ దూరం చేసుకున్నాం. వాళ్ళకేం? దర్జాగా వున్నారు. ఎటొచ్చీ రెండువైపులా నష్టపోయింది మనమే'' అని భర్త దగ్గర ఏడ్చింది.

కూతురంటే ప్రాణం మధుర తండ్రికి. బెదిరిస్తే వెళ్ళి అత్తవారింట్లో నిలదొక్కుకుంటుందని ఆశించాడుగానీ తనకే దూరమౌతుందనుకోలేదు. ఒక్కర్తీ వుంటూ, వుద్యోగం చేసుకుంటూ, పాపని పోషించుకుంటూ...ఆయనకీ దుఃఖం కలిగింది. ఎప్పుడూ తన సరదాలకోసం ఖర్చు చెయ్యని తను, కూతురు సుఖపడుతుందని ఒక అపరిచితుడికి ఎంతో డబ్బిచ్చాడు. కానీ ఆమెనతడు సుఖపెట్టలేదు. ఇప్పుడామె కష్టపడుతుంటే తను చూస్తూ వూరుకున్నాడు. తనది నిజమైన ప్రేమేనా లేక కూతురికి ఘనంగా పెళ్ళి చెయ్యటమనేది ఒక బాధ్యతగా, ప్రిస్టేజి యిష్యూగా చేసాడా అనిపించి అపరాధభావన కలిగింది.

మధురని యింటికొచ్చెయ్యమన్నాడు. ఆమె రాలేదు. ఆమెకి కావల్సిన కనీసావసరాలన్నీ సమకూర్చి మనవరాలి పేర మళ్ళీ కొంత డబ్బు ఫిక్స్ చేసాడు ఈసారి మధుర మైనర్ గార్డియన్‌గా. అక్కడితో ఆయనకి కొంత నిశ్చింత కలిగింది.

★ ★ ★

మధురది మొదట పొగరనుకున్నాడు ఆనంద్. తిరిగొచ్చినా ఆమెని ఏలుకోననుకున్నాడు. క్రమంగా ఆ ఆవేశం తగ్గింది. ఆమె తనంతట తను రాదనిపించింది లోలోపలెక్కడో. తనుగా పిలవటానికి అతనికి అహం.

''నీకేంట్రా? మళ్ళీ సంబంధం వస్తుంది'' అన్నారు అతని తల్లిదండ్రులు. కానీ అప్పటికే వాళ్ళు మధురని పెట్టిన బాధలు బంధువర్గమంతా తెలిసిపోయి ఎవరూ పిల్లనివ్వడానికి ముందుకు రాలేదు. ఒకటో రెండో సంబంధాలు వచ్చినా అవి మధుర సంబంధం ముందు కాలిగోటికి కూడా తీసికట్టనిపించాయి. వీళ్ళ కోరికలు వాళ్ళకి చుక్కల్ని చూపించాయి.

★ ★ ★

రోజులు సంవత్సరాలుగా మారాయి. ఎన్నో మార్పులు...

మధుర తల్లీతండ్రీ చనిపోయారు. ఆనంద్ దగ్గరకి వెళ్ళిపోతే బావుంటుందన్న ప్రస్తావన ఒకటి రెండుసార్లు వచ్చినా ఆమె తిరస్కరించింది.

''నా దగ్గరికి వచ్చెయ్యమ్మా! ఒక్కదానివీ విడిగా ఎందుకు?'' అన్నాడు ఆమె అన్న. ఆమె వినలేదు. ''ఇద్దరం చదువులోనూ, ఆటల్లోనూ పోటీపడేవాళ్ళం. ఈరోజున నాకో స్థిరమైన వుద్యోగం వుంది. భార్యాపిల్లలున్నారు. మనిషన్నవాడికి వుండాల్సిన సంతృప్తి వుంది. కానీ నువ్విలా వుండిపోవడం చూస్తుంటే బాధనిపిస్తోందమ్మా'' అన్నాడు. ''నేను ఆడపిల్లని కదన్నయ్యా! అందుకే పోటీలో వెనకబడిపోయాను'' విరక్తిగా అంది మధుర.

''ఈరోజుల్లో తప్పేముంది? పూజితని మేం పెంచుకుంటాం. నువ్వు డివోర్స్ తీసుకుని మరో పెళ్ళి చేసుకోవచ్చు కదా మధూ?'' అంది వదిన.

''ఒకసారి నరకంలోకి వెళ్ళి అదృష్టవశాత్తూ బైటికొచ్చాను. మళ్ళీ వెళ్ళమంటావా వదినా?'' అడిగింది మధుర.

''అందరూ ఒకలా ఎందుకుంటారు? ఆనంద్‌కి కాంట్రాస్ట్‌గా మీ అన్నయ్యలేరా?''

మధుర నవ్వింది. ''ఆనంద్ తటస్థపడటం నా దురదృష్టం. అన్నయ్యతో పెళ్ళవటం నీ అదృష్టం. అదృష్టం మీద ఆధారపడే ఈ ఆటకోసం మరోసారి నేను పావులు విసరలేను'' అంది.

నిజమే. దానికి పరిష్కారం ఎవరి దగ్గరా లేదు.

ఇంత జరిగాక ఆనంద్ మధుర దగ్గరకొచ్చాడు. కారణాలు ఏవైనా కావచ్చు. అతను మారాననుకుంటున్నాడు. అవసరాలు అతన్ని మార్చాయనిపిస్తోంది మధురకి. పెరుగుతున్న వయసు, పెద్దవాళ్ళ బాధ్యత, అతనికి భార్య అవసరాన్ని చూపించి వుంటాయి. రెండో సంబంధం ఎప్పుడూ మొదటి సంబంధమంత బావుండదు కాబట్టి తనకి ప్రాధాన్యత యిచ్చి వుండచ్చు. ఏది ఏమైనా మారింది అతను కాదు, పరిస్థితులు. అంతకన్నా సున్నితంగా ఆలోచించడం ఆమెకి సాధ్యపడలేదు.

★ ★ ★

ఉదయం మళ్ళీ వచ్చాడు ఆనంద్ ఆశ వదలక. పూజిత యింటిముందు మొక్కలకి నీళ్ళుపెడ్తోంది. ఆనంద్‌ని చూడగానే పైపు వదిలేసి లోపలికి పరిగెత్తింది.

''అమ్మా! డేడీ మళ్ళీ వచ్చారు. రామని చెప్పెయ్'' అంది తల్లి మెడని అల్లుకుపోయి. ఆ మాటల వెనకే వచ్చిన ఆనంద్ విన్నాడు.

ముఖం పాలిపోయింది. ఒక తప్పు జరిగి, దాన్ని సరిదిద్దుకునే లోగా ఎంత నష్టం జరిగింది. పూజ మనసులో తనకి స్థానం లేదు. అతను నిశ్చేష్టుడయ్యాడు.

మధుర పూజితని తన నుండీ విడదీస్తూ ''నువ్వెళ్ళి మొక్కలకి నీళ్ళు పెట్టు. లేకపోతే మనిద్దరం వెళ్ళిపోగానే ఆకలికి అవి ఏడుస్తాయి'' అంది. పూజిత వెళ్ళింది.

''మీరు అర్ధం చేసుకోవడానికి ప్రయత్నిస్తానంటే నేను కొద్దిగా చెప్పనా?'' అడిగింది మధుర. అతను తలూపాడు.

''పిల్లలకి తాము పుట్టిన క్షణం నుంచీ తల్లిదండ్రులు విడదియ్యలేని జంటగా కనిపించాలి. భౌతికమైన అవసరాలన్నీ తల్లే తీర్చినా పరిచ్చాయలా ఆమెని ఆవరించుకుని వుండే తండ్రినీ వాళ్ళు గుర్తిస్తారు. తండ్రి కూడా వాళ్ళని ఎత్తుకుని షికారు తిప్పడం.. ఏడ్చి, అల్లరిచేసి అమ్మని ఏడిపిస్తున్నప్పుడు తాము కూడా వోదార్చడంలాంటి చర్యల ద్వారా పిల్లలకి దగ్గరౌతారు. పూజ విషయంలో మీరు అపరిచితులు. అది నన్ను వంటరిగానే చూసింది. దాని ప్రయారిటీస్ లిస్టులో మీరు చివరెక్కడో వుంటారు. తనకి నాన్న లేరనుకుంటుంది తప్ప వుండి తీరాల్సిన అవసరం అనుకోదు. దాని మనసు గెలుచుకోండి'' అంది.

ముగ్ధమోహనంగా తన వెన్నంటి వచ్చిన నవవధువు మనసే గెలుచుకోలేకపోయిన ఆనంద్ తనకది సాధ్యమౌతుందనుకోలేదు. కానీ కూతురి ప్రాధమ్యాల వరసలో పైకి రావాలంటే అది తప్పనిసరని అర్థమైంది. బంతి అతని కోర్టులో వుంది.

☆